క్లుప్తంగా

25 శాతం రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

యద్దనపూడి: మండలంలోని రైతులకు 25 శాతం సబ్సిడీపై బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం రైతు సేవా కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి తెలిపారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్‌తో రైతుసేవా కేంద్రాల్లో ఉన్న వీఏఏలను సంప్రదించి నగదును చెల్లించాలన్నారు. ఒక్కో ఎకరాకు 40 కేజీల చొప్పున 5 ఎకరాల వరకు విత్తనాలు అందిస్తామన్నారు. జేజీ-11, కాక్-2 రకాలు అందుబాటులో ఉన్నాయని, క్వింటా రూ.7800 కాగా సబ్సిడీ రూ.1950 పోనూ రైతు రూ.5850 నగదును చెల్లించాలని సూచించారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేస్తే చర్యలు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని రైతులు బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు బ్లాక్ బర్లీ పొగాకును సాగు చేయాలని ఉద్దేశంలో ఉన్నట్లు తెలియవచ్చిందని, అన్ని గ్రామాల రైతులకు తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్, ఏఓ ఎన్ మేరిమ్మ, ఎస్‌ఐ జీ సురేష్‌లు సంయుక్తంగా తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏ రైతైనా సరే బ్లాక్ బర్లీ పొగాకును సాగు చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్రాప్ హాలిడే ప్రకటించిన సందర్భంగా బ్లాక్ బర్లీ పొగాకు ఎట్టి పరిస్థితుల్లో సాగు చేయరాదని అలా చేస్తే క్రిమినల్ తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేలు జరిమానా

అద్దంకి రూరల్: అద్దంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక భవాని సెంటర్‌లో మద్యం తాగి కారు నడుపుతున్న వ్యక్తిని సీఐ సుబ్బరాజు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి బీ. అఖిల నిందితుడికి రూ. 10 వేలు జరిమానా విధించారు. ఎవరైనా తాగి వాహనాలు నడిపితే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసకుంటామని సీఐ హెచ్చరించారు.

నేడు వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం

పర్చూరు(చినగంజాం): నియోజకవర్గంలోని పర్చూరు, కారంచేడు మండలాలకు సంబంధించి వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10. 30 గంటలకు కారంచేడు, మధ్యాహ్నం 3 గంటలకు పర్చూరు మండలాల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రెండు మండలాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని వారు కోరారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

పర్చూరు(చినగంజాం): పర్చూరులోని బీపీ ఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమిస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషుకుమారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి ఎం మాధవి మంగళవారం ప్రకటనలో తెలియజేశారు. మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు, 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. అక్టోబరు 20 వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. విద్యార్హతలు టెన్త్, ఇంటర్, డిగ్రీ కాగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తారని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పీ వినోద్ కుమార్ తెలియజేశారు. పూర్తి సమాచారం కోసం 63027 64962 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మృతి చెందిన లక్ష్మణరావు

బల్లికురవ: ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై వై. నాగరాజు వివరాల మేరకు.. మండలంలోని కొమ్మినేనివారి పాలెం గ్రామానికి చెందిన నాయుడు లక్ష్మణరావు (37) అవివాహితుడు. సోమవారం మనస్తాపంతో గడిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు చికిత్సకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. మంగళవారం మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు. మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మణరావు కుటుంబ సభ్యులు రామ్మూర్తి, దర్శి రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కృష్ణబాబు, యూత్ అధ్యక్షుడు మక్కెన రవిబాబు, పరామర్శించారు.


గుంతలమయంగా మారిన ప్రసాద్‌నగరం ప్రధాన రహదారి


చెరువులా మారిన వాడరేవు గ్రామంలోని ప్రధాన రహదారి

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా ?

- అధ్వానంగా వాడరేవు రోడ్డు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, అధికారులు

చీరాల టౌన్: ఇప్పుడిప్పుడే పర్యాటకులు గోవా వైపు వెళ్లకుండ గత ఐదేళ్ల నుంచి చీరాల బీచ్‌ల వైపు పరుగులు తీస్తున్నారు. ఈ రోడ్లు పర్యాటక ప్రాంతమైన వాడరేవు సముద్ర తీరానికి వెళ్లే ప్రధాన రహదారులు. నిత్యం ప్రజలు, పర్యాటకులు, మత్స్యకార ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులు నడిచే వీలు లేకుండా అధ్వానంగా మారాయి. పర్యాటకంగా ముందుకెళ్తున్న వాడరేవు రోడ్లు ఛిద్రంగా ఉండటంతో ప్రజలు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారి వర్షపు నీరు నిల్వ చేరడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు.

నడవాలంటే నరకం..

పేరాల నుంచి వాడరేవు వెళ్లే ప్రదాన రహదారి అయిన ప్రసాద్‌నగరం వద్ద రోడ్డు అంతా గుంతలమయంగా మారి అధ్వానంగా మారింది. రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో నడవాలంటే నరకం. వాహనాల్లో వెళితే నడుం నొప్పులు తప్పకుండా వచ్చేలా ఉన్నాయి. అలానే పర్యాటక గ్రామమైన వాడరేవులోని ప్రధాన రహదారి గుంతలమయంగా, నీటి నిల్వలతో చెరువులను తలపిస్తోంది. ప్రజలకు మౌళిక వసతులను కల్పించడంలో కూటమి పాలకులు తీవ్రంగా విఫలమయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు ఉదాసీనత, పాలకుల నిర్లక్ష్యం వలన తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.


కారంచేడు: ఐకేపీ కార్యాలయం సమీపంలో బురదగా మారిన రహదారి


చెంచురామయ్య కాలనీ సమీపంలో రోడ్డు దుస్థితి ఇలా..

కొద్దిపాటి వర్షానికే బురదమయంగా రహదారులు

కారంచేడు: చినుకు పడిందంటే చిత్తడిగా మారే రహదారులు దర్శనమిస్తున్నాయి. సంపన్నుల గ్రామంగా పేరొందిన మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో రోడ్లు భయంకరంగా మారాయి. గ్రామంలో రొంపేరు ఎడుమ కాలువ కట్ట సమీపంలో మండల (ఇందిరా క్రాంతి పథం) ఐకేపీ వెలుగు కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందితో పాటు, నిత్యం డ్వాక్రా మహిళలు కార్యాలయానికి వస్తుంటారు. కార్యాలయ సిబ్బందితో పాటు, డ్వాక్రా మహిళలు ఆఫీస్‌కు రావాలంటే ఈ రోడ్డులోనే వెళ్లాలి. మరో మార్గం లేదు. ఎప్పుడు వర్షం కురిసినా ఇదే దుస్థితి. గతంలోను ఎన్నో సార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని వారు వాపోతున్నారు. వీరు మాత్రమే కాకుండా సమీపంలోని చెంచురామయ్య కాలనీకి వెళ్లే ప్రజలు సైతం ఈ రహదారిలో ప్రయాణాలు చేస్తుంటారు. చీరాల నుంచి కారంచేడు మీదగా కుంకలమర్రు వెళ్లే ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాలు సైతం ఈ రోడ్డులో దగ్గర మార్గమని ప్రయాణాలు చేస్తుంటారు. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి సమస్యకు పరిష్కారం చూపించాలని వెలుగు కార్యాలయ సిబ్బంది, కుంకలమర్రు వెళ్లే గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

తీరంలో పర్యాటకుల ప్రాణాలకు రక్షణేది?


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- కూటమి ప్రభుత్వం వచ్చాక తీరంలో ఎక్కువ మరణాలు
- గతంలో ఎమ్మెల్యే చేసిన భద్రత ఏర్పాట్ల జాడ లేదు

చీరాల: నియోజకవర్గంలోని వాడరేవు, రామాపురం సముద్రతీర ప్రాంతానికి వచ్చే పర్యాటకుల ప్రాణాలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని.. వారి ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం చీరాల మండలం వాడరేవు తీరంలో ఐదుగురు విద్యార్థులు గల్లంతై మృతి చెందారన్నారు. సముద్ర తీరంలో కేరింతలు కొడుతూ ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతయ్యారన్నారు. మరికొందరు ప్రమాదంలో ఉండగా స్థానికులు రక్షించి ఒడ్డుకు చేర్చారన్నారు. గతంలోనూ ఇదే విధంగా రోజుల వ్యవధిలోనే తీరానికి వచ్చిన పర్యాటకులు సముద్రంలో మునిగి మరణించిన ఘటనలు ఉన్నాయన్నారు.

డబ్బులు వసూలు చేస్తున్నా.. ఫలితం శూన్యం

రిసార్ట్స్ నిర్వాహకులు సమావేశం ఏర్పాటు చేసుకొని భద్రతా ఏర్పాట్లు, భద్రతా జాగ్రత్తలతో బోర్డులు, గజ ఈతగాళ్లకు ఇచ్చే జీతాలు రిసార్ట్స్ వారే బాధ్యత తీసుకుని రూముల సంఖ్యను బట్టి రూ.600 వరకు వసూలు చేశారన్నారు. అయితే తీర ప్రాంతంలో ఆ భద్రతా ఏర్పాట్లు ఎక్కడా కానరావడం లేదన్నారు. ప్రతినెలా డబ్బులు అయితే వసూలు చేస్తున్నారని, అక్కడ ఎలాంటి వసతులు కల్పించారనేది తెలియడం లేదన్నారు. మెరైన్ ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు గాని పోలీసుల గస్తీ ఉండడం లేదన్నారు. చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చీరాల, బాపట్ల బీచ్‌లను అభివృద్ధి చేసి పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారని, పర్యాటకుల ప్రాణాలకు భద్రతలు కల్పించకుండా అభివృద్ధి జరగాలంటే ఎలా సాధ్యపడుతుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీ ఈ విషయంపై దృష్టి సారించి పర్యాటకులకు తీరంలో మెరుగైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఐదుగురు గల్లంతై మరణించగా పరిస్థితిని సమీక్షించడానికి జిల్లా కలెక్టర్ వస్తే గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు కనిపించాయన్నారు. ఈ విషయాన్ని రాజకీయం చేయాలనే ధోరణితో చెప్పడం లేదని, పర్యాటకులకు మెరుగ్గా వసతులు కల్పించాలనేదే మా ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వాసిమళ్ల వాసు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోసాల అశోక్, చీరాల నియోజకవర్గ డాక్టర్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవ, వేటపాలెం మండల మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ చెల్లి బాబూరావు, నాయకులు వెంకటరాజు, మున్సిపల్ జిల్లా విభాగ సభ్యులు కంచర్ల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరెడ్డి సేవలు ప్రశంసనీయం


ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీడీవో అధికారులు

బల్లికురవ: మూడున్నర దశాబ్దాలపాటు సెక్రటరీగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడి ఉద్యోగోన్నతిపై డిప్యూటి ఎంపీడీవోగా నెల్లూరు జిల్లాకు వెళుతున్న చదలవాడ వరప్రసాదరెడ్డి సేవలు ప్రశంసనీయమని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. మండలంలోని గొర్రెపాడు గ్రేడ్-1 సెక్రటరీగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై నెల్లూరు జిల్లాకు వెళ్తున్న ప్రసాదరెడ్డిని స్థానిక పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అద్దంకి, బల్లికురవ, యర్రగొండపాలెం మండలాల్లోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందించిన సేవలను డిప్యూటి ఎంపీడీవో దాసరి సుమతి పంచాయతీరాజ్ ఏఈ మాధవరెడ్డి, కార్యాలయ ఏవో పాండురంగస్వామి సెక్రటరీలు కొనియాడారు.

డ్రైవర్‌ను ఢీకొట్టిన బైకు


గాయపడిన లారీ డ్రైవర్

మేదరమెట్ల: లారీని నిలిపి రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను అటుగా వచ్చిన మోటారు బైకు ఢీకొన్న ఘటన కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపుకు కర్రల లోడుతో వెళ్తున్న లారీ చెక్ పోస్టు వద్ద నిలిపి పేపర్లు చూపించేందుకు డ్రైవర్ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఒంగోలు వైపు వెళ్తున్న మోటారు బైకు లారీ డ్రైవర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తలకు తీవ్రగాయం కాగా హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు హైవే పోలీసులు తెలిపారు.

కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ కుమార్, పార్టీ శ్రేణులు


మంచి ప్రభుత్వం అంటే
భవిష్యత్ నాశనం చేయడమేనా ?

- అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అశోక్‌కుమార్

అద్దంకి రూరల్: మంచి ప్రభుత్వం అంటే విద్యార్థుల జీవితం నాశనం చేయడమేనా అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల పోస్టర్‌ను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ.. కూటమి సీఎం చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో భారీ కుట్రకు తెరలేపారన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి డబ్బులు దండుకునేందుకు పీపీపీ విధానం తీసుకువచ్చారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో కోటి సంతకాల సేకరణతో గవర్నర్‌కు అందజేస్తామన్నారు. కూటమి నాయకులు చేసే కుటిల రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, స్థానిక నేతలు అవిశెన ప్రభాకరరెడ్డి, వార్డు కౌన్సిలర్‌లు, వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ..

బల్లికురవ: కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం రాత్రి వెలమవారిపాలెం, జమ్ముల మడక కాలనీ కొత్తూరు, అరుణగిరి, కూకట్లపల్లి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వారం రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తిచేసి నియోజకవర్గ కేంద్రం అక్కడ నుంచి జిల్లా కేంద్రానికి పంపుతామని కృష్ణబాబు వివరించారు. కార్యక్రమంలో వెలమవారిపాలెం సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, నూనె ప్రభుదాసు, మామిళ్లపల్లి తిరుపతిదానయ్య, మండల యూత్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు మక్కెన రవిబాబు, ఏ సతీష్, ప్రత్తిపాటి అక్కులు, ఊడావత్ హరికృష్ణ నాయక్, గన్నమనేని వెంకట రామిరెడ్డి, హింసావంత్ కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


వెలమవారిపాలెంలో సంతకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కృష్ణబాబు

విద్యార్థినికి అభినందనలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మీ ప్రియ ఎంపికైనట్లు హెచ్ఎం దేవరకొండ సరోజిని మంగళవారం తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఒంగోలులో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 52 కేజీల విభాగంలో యార్లగడ్డ లక్ష్మీప్రియ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని పీఈటీ జడ దేవభిక్షం, జరుబుల శ్రావణి, స్టాఫ్ సెక్రెటరీ కాల్వ సోమశేఖర్, ఉమ్మిటి వేణుగోపాలరావు అభినందించారు.

అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు అందించాలి


తహసీల్దార్‌కు వినతి ప్రతం ఇస్తున్న కౌలు రైతులు

జే.పంగులూరు: అన్నదాత సుఖీభవ పథకం రూ. 20 వేలు కౌలు రైతులకు అందించాలని.. నూతన కౌలు చట్టం తీసుకురావాలని రైతు సంఘం నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయిణి వినోద్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందన్నారు. రైతుతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వెంటనే అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తల్లపనేని రామారావు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు రీసర్వే

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ నిబంధనల మేరకు భూముల రీసర్వేను పటిష్టంగా నిర్వహించాలని రీ సర్వే డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో జరుగుతున్న మూడో విడత భూముల రీసర్వే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేటాయించిన సర్వే నంబర్లలో ఎంపిక చేసిన సిబ్బంది తప్పకుండా సర్వేను కొనసాగించాలన్నారు. రీ సర్వే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ముందుగా ఆయన రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దారు జీ నాగరాజుతో జరుగుతున్న రీ సర్వేపై చర్చించారు. ఆయన వెంట జిల్లా సర్వేయర్ మునలయ్య, రీసర్వే డీటీ అందే శ్రీనివాసరావు, సర్వేయర్ సత్యనారాయణ, గ్రామంలోని వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల కూల్చివేత


అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

వేటపాలెం: అక్కాయిపాలెం పంచాయతీ రామాపురం వద్ద సర్వే నంబరు 427-3లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఫెన్సింగ్‌ను జేసీబీతో తహశీల్దార్ గీతారాణి తన సిబ్బందితో మంగళవారం కూల్చివేశారు. సముద్రతీరం వెంట ప్రభుత్వ భూముల్లో ఆక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవడం తోపాటు వాటిని కూల్చి వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీతో ప్రజలకు మేలు


ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో విజయ

చీరాల టౌన్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని ఎంపీడీవో ఎన్.విజయ తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై మంగళవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామంలోని చేనేత మాస్టర్ వీవర్లు నిర్వహిస్తున్న చేనేత వస్త్రాల అమ్మకాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీ, సచివాలయాల ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యా కాపాడండయ్యా నన్ను!


టిప్పరు సాయంతో బస్సును బయటకు లాగుతున్న దృశ్యం

యదనపూడి: పై ఫొటోలో కనిపిస్తున్న బస్సు రిపేరు అయ్యిందనుకునేరు. కాదుకాదు. రోడ్డు బాగోలేకపోవడంతో బస్సు బురదలో కూరుకుపోయింది. మంచి కూటమి ప్రభుత్వంలో రోడ్లు మరీ అధ్వానంగా తయ్యారయ్యాయి. నాలుగు రోజుల క్రితం యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలో చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యిలో కూరుకుపోయింది. తాజాగా మంగళవారం మధ్యాహ్నం మండలంలోని యనమదల గ్రామంలో అద్దంకి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డుపై ఉన్న గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో స్థానికులు అదే మార్గంలో వెళ్తున్న టిప్పరుకు మోకులు కట్టి బస్సును అతి కష్టంపై బయటకు తీశారు. అలాగే పూనూరు-గన్నవరం, మార్టూరు-గన్నవరం గ్రామాల మధ్య తరచూ ఇలాగే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశ భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే ధనలక్ష్మి తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నారని ఆమె తెలిపారు.

అంటువ్యాధుల నిర్మూలనపై ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న వైద్యాధికారి చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): వైద్య సిబ్బంది అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెరుకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జ్ వైద్యాధికారి, ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. పారిశుద్ధ్యం, పరిసరాల శుభ్రత, అంటు వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైఫాయిడ్, కలరా, తదితర వ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, హెచ్‌ఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.